
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అల్లూరి సీతారామరాజు
జిల్లా వార్తలు
గురువారం 8 ఆగస్టు 2024



రెపె ఛేజ్ హీట్స్‌లో
ఎర్రాజీ జ్యోతి
సెమీ ఫైనల్స్‌కు చేరే అవకాశం
-వార్త 7వ పేజీలో...





అధికారులతో సమావేశమైన జీసీసీ ఎండీ కల్పనాకుమారి, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్

కాఫీకి గిట్టుబాటు ధర కల్పిస్తాం..

- జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి
- కాఫీ రైతులకు రుణాలు
- ఏటా 5 వేల టన్నులు కాఫీ కొనుగోలు చేస్తామని ప్రకటన

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):
గిరిజన కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యమని గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కల్పనాకుమారి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాఫీ రైతులకు జీసీసీ ద్వారా రుణాలు అందిస్తామని, క్షేత్ర స్థాయిలో ఐటీడీఏ కాఫీ విభాగం సిబ్బందితో జీసీసీ సిబ్బంది కలిసి పని చేయాలన్నారు. చింతపల్లిలోని మాక్స్ సంస్థ ద్వారా మూడు వేల మెట్రిక్ టన్నుల కాఫీ సేకరణకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. ఇకపై ప్రతి ఏడాది జీసీసీ ద్వారా 5 వేల టన్నుల కాఫీ కొనుగోలు చేస్తున్నామన్నారు వచ్చే ఏడాది నుంచి జీసీసీ, ఐటీడీఏ సంయుక్తంగా కాఫీ కొనుగోలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే కాఫీ రైతులతో మాట్లాడి కాఫీ ఉత్పత్తులు, రైతులు పొందుతున్న ధరలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఏజెన్సీలో కాఫీ కొనుగోలు చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారుల గురించి అడిగి తెలుసుకున్నారు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ ఏజెన్సీలో కాఫీ సాగుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ ఏడాది వెయ్యి టన్నుల కాఫీ పండ్ల సేకరణ లక్ష్యం కాగా 700 టన్నులను చింతపల్లి మ్యాక్స్ సొసైటీ ద్వారా సేకరించామన్నారు. అలాగే జి.మాడుగుల, జీకేవీధి మండల కేంద్రాల్లో ఎకో పల్పింగ్ యూనిట్లు నిర్మాణం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వీఎస్.ప్రభాకర్, ఎం.వెంకటేశ్వరరావు, జీసీసీ పాడేరు డీఎం సింహాచలం, సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు, కాఫీ విభాగం విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో సోప్ యూనిట్
జీసీసీ ఎండీ కల్పనాకుమారి
- 7లో

ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలు వ్యవహారం!

నీటి పథకాల నిర్వహణ పనులకు టెండర్
ఒక శాతం మైనస్‌కు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు టెండర్

- చక్రం తిప్పిన ఒక డీఈఈ
- ప్రభుత్వ ఖజానాకు గండి
- కొత్తగా టెండర్ నిర్వహించాలని డిమాండ్

(ఆంధ్రజ్యోతి-పాడేరు)
గ్రామీణా నీటి సరఫరా విభాగంలో అడ్డగోలు వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. పాడేరులోని తాగునీటి పథకాల నిర్వహణ పనుల టెండర్ వ్యవహారంలో ఓ డీఈఈ చక్రం తిప్పి తక్కువకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు ఆ పనుల దక్కేలా పైరవీలు సాగించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ టెండర్‌ను రద్దు చేసి, జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తగా టెండర్ పిలవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

పాడేరు పట్టణ వాసులకు తాగునీటిని అందించేందుకు కుమ్మరిపుట్టు, జి.ముంచంగిపుట్టులో నీటి పథకాలున్నాయి. ఈ రెండు నీటి పథకాల నిర్వహణ పనులకు ప్రతి ఏడాది టెండర్ పిలుస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది(2024- 25)కి సంబంధించిన టెండర్ ప్రక్రియను ఇటీవల విశాఖపట్నంలోని గ్రామీణా నీటి సరఫరా విభాగం సూపరింటెండెంట్ కార్యాలయంలో జరిగింది. ఎటువంటి టెండర్‌లోనైనా ఎక్కువ శాతం మైనస్ రేటుకు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కడం సహజం. కాని ఆర్‌డబ్ల్యూఎస్‌లో అందుకు భిన్నంగా పాడేరులోని నీటి పథకాల నిర్వహణ టెండర్‌లో 1 శాతం మైనస్‌గా కోట్ చేసిన కాంట్రాక్టర్‌కే టెండర్ దక్కింది. స్థానిక నీటి పథకాల నిర్వహణకు ఏడాదికి సుమారు రూ.70 లక్షల వరకు వ్యయం అవుతుంది. దానిలో రూ.40 లక్షలు విద్యుత్ బిల్లులకు, మిగిలిన రూ.30 లక్షలతో నీటి పథకాల నిర్వహణ పనులు, సిబ్బంది వేతనాలకు వ్యయం చేస్తారు. ప్రతి ఏడాది రెండు నీటి పథకాల నిర్వహణ పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు టెండర్లు వేస్తారు. అందులో భాగంగా ఈ ఏడాది జూలైలో టెండర్‌కు కాంట్రాక్టర్లను ఆహ్వానించారు. ఈ టెండర్‌ను దక్కించుకునేందుకు ఐదుగురు కాంట్రాక్టర్లు పోటీ పడ్డారు. ఒకరు 1 శాతం మైనస్, మరో నలుగురు వరుసగా 10, 15, 23, 26 శాతం మైనస్‌కు టెండర్ వేశారు. వాస్తవానికి ఎక్కువ మైనస్‌కు కోట్ కాంట్రాక్టర్‌కు టెండర్ దక్కాలి. కాని అందుకు భిన్నంగా కేవలం 1 శాతం మైనస్‌కు టెండర్ వేసిన కాంట్రాక్టర్‌కే ఈ టెండర్ దక్కడం విశేషం.

తెర వెనుక చక్రం తిప్పిన డీఈఈ
పాడేరులోని నీటి పథకాల నిర్వహణ పనులకు సంబంధించిన టెండర్‌ను 1 శాతం మైనస్‌కు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు దక్కడం వెనుక ఓ డీఈఈ హస్తం ఉందని కాంట్రాక్టర్లు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ స్థానిక ఈఈ జూలైలో పదవీ విరమణ చేయడంతో విజయనగరం జిల్లాకు చెందిన ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్‌కు చెందిన ఓ డీఈఈ డిపార్టుమెంట్‌లో చక్రం తిప్పి, టెండర్ నిబంధనల్లోని లొసుగులు ఆధారంగా ఎక్కువ మైనస్‌కు కోట్ చేసిన నలుగురు కాంట్రాక్టర్లు టెండర్ పొందేందుకు అనర్హులను చేసి, కేవలం 1 శాతం మైనస్‌కు కోట్ చేసిన కాంట్రాక్టర్‌కు ఈ టెండర్ దక్కేలా చేశారని తెలుస్తున్నది. మరో విశేషమేమిటంటే.. తాజా టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టరే గతేడాది ఇదే టెండర్‌ను 15 శాతం మైనస్‌కు దక్కించుకున్నారు. అయితే సదరు డీఈఈ అండదండలతో ఈ దఫా కేవలం 1 శాతం మైనస్‌కే టెండర్‌ను పొందారని ప్రచారం జరుగుతున్నది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్‌లో జరిగిన ఈ అడ్డగోలు వ్యవహారం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.



పాడేరులోని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ కార్యాలయం

టెండర్ రద్దు చేయాలని డిమాండ్
అడ్డగోలుగా జరిగిన ఈ టెండర్‌ను రద్దు చేసి కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో కొత్తగా టెండర్ నిర్వహించాలని డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. టెండర్ వ్యవహారంపై పలు పత్రికల్లో ప్రకటనలిచ్చి అందరికీ తెలిసేలా ప్రచారం చేసి టెండర్ నిర్వహించాలని కాంట్రాక్టర్లు అంటున్నారు. జిల్లా అధికారులు స్పందించి పాడేరులోని నీటి పథకాల నిర్వహణ టెండర్‌లో జరిగిన అడ్డగోలు వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పలువు డిమాండ్ చేస్తున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్. పక్కన ఎస్పీ అమిత్‌బర్దార్, జేసీ అభిషేక్

ఎమ్మెల్సీ కోడ్‌ను పక్కాగా అమలుచేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆదేశం

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):
స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎన్నికల కోడ్ అమలుపై ఎస్పీ అమిత్‌బర్దార్, జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్‌లతో కలిసి బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మండలాల్లో ఎంపీడీవోలు ఎన్నికల నియమావళి అమలుకు నోడల్ అధికారులుగా, తహసీల్దార్లు మండల మెజిస్ట్రేట్‌లుగా వ్యవహరించాలన్నారు. అందుకు అవసరమైన ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

అలాగే ఈనెల 6న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయిందని, 30న పోలింగ్, సెప్టెంబరు మూడున కౌంటింగ్, 6 తేదీతో ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అంతవరకు పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లోనూ ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు వేయాలని, పత్రికల్లో వచ్చిన వార్తలకు తక్షణమే స్పందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఏజెన్సీలోని మొత్తం 177 మంది ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు అర్హత కలిగిన సభ్యులున్నారని, స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు.

రాజకీయ ప్రమేయం లేకుండా ఆదివాసీ దినోత్సవం
డివిజన్ పరిధిలో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎటువంటి రాజకీయ ప్రమేయం లేకుండా ఈ నెల తొమ్మిదిన ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ సూచించారు. ఎన్నికల నిబంధనలకు లోబడి మాత్రమే ఆదివాసీ దినోత్సవాన్ని చేపట్టాలన్నారు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే రెవెన్యూ, పోలీస్ విభాగాల భాగస్వామ్యంతో ఎన్నికల కోడ్ అమలుపై నిఘా పెట్టాలన్నారు. ప్రధానంగా ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలపై నిఘా పెట్టి, వాటిని నియంత్రించాలన్నారు.

అలాగే ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే చట్టపరంగా కేసులను నమోదు చేస్తామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డివిజన్‌లోని 11 మండలాల అధికారులు పాల్గొన్నారు.

బలిమెల, జోలాపుట్ నీటి పంపకం

సమావేశమైన ఆంధ్రా, ఒడిశా అధికారులు
మొత్తం నీటి నిల్వలు 103.5284 టీఎంసీలు

- ఆంధ్రా వాటా 53.8407 టీఎంసీలు
- ఒడిశా వాటా 49.6877 టీఎంసీలు

సీలేరు, ఆగస్టు 7:
ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల, జోలాపుట్ జలాశయాల నీటి పంపకాన్ని ఇరు రాష్ట్రాల అధికారులు చేసేశారు. బుధవారం ఒడిశా చిత్రకొండ ఓహెచ్‌పీసీ కార్యాలయంలో జరిగిన ఆంధ్రా, ఒడిశా అధికారులు నీటి వినియోగంపై చర్చించారు. బలిమెల, జోలాపుట్ జలాశయాల్లో 103.5284 టీఎంసీల నీటి నిల్వలుగా లెక్కించారు.

ఇందులో ఏపీ వాటా 53.8407 టీఎంసీలు, ఒడిశా వాటాగా 49.6877 టీఎంసీలుగా పంపకాలు చేశారు. అలాగే 2024 -2025 నీటి సంవత్సరంలో జూలై నెలలో ఒడిశా 7.6755 టీఎంసీల, ఆంధ్రా వాటాగా 3.5225 టీఎంసీలను వినియోగించుకున్నట్టు లెక్కలను తేల్చారు. దీని ప్రకారం ఒడిశా ఆంధ్రా కంటే 4.5558 టీఎంసీల నీటిని అధికంగా వినియోగించుకున్నట్టు ఇరు రాష్ట్రాల అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల గ్రిడ్ డిమాండ్ అవసరాల మేరకు ఆంధ్రాకు 1000 క్యూసెక్కులు, ఒడిశాకు 3,100 క్యూసెక్కుల నీటిని బలిమెల జలాశయం నుంచి వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల మధ్య అంగీకారం కుదిరింది. ఈ సమావేశంలో ఒడిశా తరుపున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజనీర్ పితబాస్ శెట్టి, చిత్రకొండ ఎర్త్‌డ్యాం డివిజన్ ఎస్ఈ రమాకాంత పాత్రో, బలిమెల హైడ్రో పవర్ ప్రాజెక్టు జనరల్ మేనేజర్ కృపాసింధు బిస్వాల్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జ్యోతిర్మయిదాస్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఓఎం ప్రకాష్ నాయక్, రాకేష్ పాణిగ్రహిలు పాల్గొనగా, ఆంధ్రా తరుపున ఏపీ జెన్‌కోకు చెందిన సీలేరు కాంప్లెక్సు ఇన్‌చార్జి ఎస్ఈ బి చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ వెంకటమధు, ఏఈఈలు సీహెచ్ సురేష్, కేఎస్ అనుదీప్ పాల్గొన్నారు.



ఒడిశా చిత్రకొండ ఓహెచ్‌పీసీ కార్యాలయంలో బలిమెల, జోలాపుట్ జలాశయాల నీటి వినియోగంపై సమావేశమైన ఆంధ్రా-ఒడిశా అధికారులు

కొనసాగుతున్న ముసురు

- మన్యంలో మోస్తరు నుంచి భారీ వర్షం
- చిత్తడిగా మారిన రహదారులు
- పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు, వాగులు
- ఆందోళనలో మారుమూల గ్రామాల ప్రజలు



సీలేరు భారీగా కురుస్తున్న వర్షం

పాడేరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి):
మన్యంలో ముసురు వాతావరణం కొనసాగుతున్నది. బుధవారం కూడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఏజెన్సీ వ్యాప్తంగా ఉదయం నుంచే ఆకాశం మేఘావృతం కాగా జిల్లా కేంద్రం పాడేరులో జల్లులతో కూడిన వర్షం పడింది. పెదబయలు, ముంచంగిపుట్టు, డుంబ్రిగుడ, అరకులోయ మండలాల్లో భారీ వర్షం కురిసింది. తాజా వర్షానికి జన జీవనానికి అంతరాయం ఏర్పడింది. వర్షం కురిసింది.

- అరకులోయలో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వాన పడుతునే ఉంది. సాయంత్రం ఐదు గంటలకు కాస్త తగ్గుముఖం పట్టింది.
- డుంబ్రిగుడలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. కించుమండ సంత నామమాత్రంగా జరిగింది. కుసుమగుడ వద్ద జాతీయరహదారి బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.
- హుకుంపేటలో భారీ వర్షం పడింది. దీంతో వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మారుమూల గ్రామాల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.
- ముంచంగిపుట్టును గత కొద్ది రోజులుగా వర్షాలు వీడడంలేదు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరుపు లేకుండా వర్షం పడిది. రహదారులు బురదమయంగా మారడంతో వాహన చోదకులతో పాటు పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మినుములపుట్టు జంక్షన్ నుంచి బోడిపుట్టు మీదుగా చెల్లాం వెళ్లే రింగురోడ్డు ఎక్కడ పడితే అక్కడ కోతకు గురైంది.
- సీలేరులో బుధవారం వర్షం దంచికొట్టింది. గత 20 రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షానికి సీలేరులో ఇళ్ల గచ్చులు చెమ్మ చేరి, గోడలు నానిపోయాయి. దోమలు విపరీతంగా పెరిగాయి. గెడ్డలు, వాగులు మరల పొంగుతాయని ధారకొండ, దుప్పులవాడ, గుమ్మిరేవుల, గాలికొండ పంచాయతీల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు.



అరకులోయలో వర్షం

సిగినాపల్లి రంగురాళ్ల క్వారీపై ప్రత్యేక నిఘా

14మందిపై బైండోవర్ కేసులు
బేస్ క్యాంప్ ఏర్పాటు
పెదవలస అటవీశాఖ రేంజ్ అధికారి కె.శివరంజని
8



అటవీశాఖ ఉద్యోగులతో మాట్లాడుతున్న రేంజ్ అధికారి శివరంజని

ఆరోగ్యవంతమైన సమాజానికి తల్లి పాలు దోహదం

- జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ్
- ఘనంగా ముగిసిన తల్లిపాల వారోత్సవాలు

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):
ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్ గౌడ్ అన్నారు. తల్లి పాల వారోత్సవాలు ముగింపు సందర్భంగా ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి ఆధ్యక్షతన బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. శిశువు పుట్టిన దగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక, శారీరకంగా ఎదుగులకు ఉపయోగపడతాయన్నారు. చాలా మంది తల్లులు పిల్లలకు తేనె, నీళ్ల వంటివి పడుతుంటారని, అలా చేయడం వల్ల బిడ్డ అనారోగ్యానికి గురవుతారన్నారు. రెండేళ్ల నుంచి బిడ్డకు అనుబంధ పోషకాహారాన్ని అందించాలని జేసీ అభిషేక్‌గౌడ్ పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ.. ప్రతి పల్లెలోనూ తల్లిపాల ప్రాముఖ్యతపై చర్చ జరగాలన్నారు. పిల్లల్లో వ్యాధినిరోధకశక్తి పెరగడానికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు.

ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి మాట్లాడుతూ.. ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకు మండల, గ్రామస్థాయిల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. అంతకుముందు 16 మంది గర్భిణులకు సీమంతం నిర్వహించి చీరలు, పండ్లు, పసుపు కుంకుమ, బాలామృతం, టేక్ హోమ్ రేషన్‌ను అతిథులతో పంపిణీ చేయించారు. ఈ కార్యక్రమంలో హుకుంపేట పీహెచ్‌సీ డాక్టర్లు మోహన్‌సాయి, రాణాప్రతాప్, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్ఐ. డి.శకుంతల స్థానిక సీడీపీవో ఝాన్సీరాణి, ఏజెన్సీలోనిసీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న జేసీ ఎంజే.అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్

క్రైం... crime news

రైలునుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైలునుంచి జారిపడి మృతి చెందిన వ్యక్తి

ఎస్.రాయవరం, ఆగస్టు 7 : రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారూఫ్ బుధవారం తెలిపారు. నర్సీపట్నం రోడ్డు వైపు నుంచి తుని వైళుతున్న రైలులో ప్రయాణిస్తున్న సుమారు 40 ఏళ్ల వయస్సు గల వ్యక్తి నర్సీపట్నం రోడ్డు రైల్వే స్టేషన్- గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్యలో ప్రమాదవశాత్తు జారిపడడంతో దుర్మరణం చెందాడన్నారు. అతడి శరీర భాగాలు తెగిపడ్డాయన్నారు. అయితే మృతునికి సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదన్నారు. తెలుపురంగు మీద ఎరుపు రంగు సన్నటి నిలువు చారలు కలిగిన ఫుల్ చేతుల చొక్కా, కాఫీ రంగు లోవర్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో భద్రపర్చామని, ఇతని సంబంధీకులు ఉంటే వెంటనే సంప్రదించాలని ఆయన సూచించారు.

శారదానదిలో పడి తాపీమేస్త్రి మృతి

దేవరాపల్లి, ఆగస్టు 7: బహిర్భూమికి వెళ్లిన తాపీ మేస్త్రి ప్రమాదవశాత్తూ శారదా నదిలో జారిపడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ కొమ్మనాపల్లి అమ్మతల్లి (40) బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తూ శారదా నదిలో పడిపోవడంతో ప్రాణాలు విడిచాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నాగేంద్ర తెలిపారు.

కారు బోల్తా : నలుగురికి గాయాలు


హైవే పక్కన పొలాల్లో బోల్తా పడిన కారు

నక్కపల్లి, ఆగస్టు 7: మండలంలోని ఒడ్డిమెట్ట హైవే వద్ద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించి ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలివి. నక్కపల్లి మండలం ముకుందరాజుపేట గ్రామానికి చెందిన మామిడి రాంబాబు, సత్యవతి దంపతులు తుని నుంచి బైక్‌పై వస్తుండగా, ఇదే సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొని, హైవే పక్కన ఉన్న పొలాల్లోకి దూసుకుపోయి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో రాంబాబు, అతని భార్యతో పాటు కారులో ఉన్న అచ్యుతాపురం మండలం గొర్లి ధర్మవరం గ్రామానికి మరో ఇద్దరు గాయాలకు గురయ్యారు. పోలీసులు వీరిని తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేశారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై బుధవారం ఫిర్యాదు అందినట్టు పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. మాడుగుల గ్రామానికి చెందిన విద్యార్థినిని ఆమె తండ్రి మూలపేటలో ఉన్న తన సోదరుడి ఇంటికి పంపించాడన్నారు. రెండు నెలలుగా ఇక్కడే ఉంటున్న సదరు విద్యార్థిని బుధవారం తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదన్నారు. దీంతో తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

పది మద్యం సీసాలు స్వాధీనం

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : పట్టణంలోని సుంకరమెట్ట జంక్షన్‌లో ఓ వ్యక్తి పది మద్యం సీసాలతో పట్టుబడినట్టు హెడ్ కానిస్టేబుల్ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సబ్బవరం గ్రామానికి చెందిన గనిరెడ్డి అప్పారావు అనకాపల్లిలోని మద్యం దుకాణాల్లో పది మద్యం సీసాలను బుధవారం కొనుగోలు చేసి సబ్బవరం వెళ్లేందుకు సుంకరమెట్ట జంక్షన్ వద్ద ఉన్నాడన్నారు. అనుమానం వచ్చిన పోలీసులు తనిఖీ చేయగా, అతని వద్ద మద్యం సీసాలు పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

ట్రెంచ్ తవ్వకంపై ఇరువాడ రైతులు ఆందోళన


నిరసన తెలియజేస్తున్న రైతులు

సబ్బవరం, ఆగస్టు 7 : పొలాలకు వెళ్లే మార్గంలో రెవెన్యూ అధికారులు ట్రెంచ్ తవ్వడం పట్ల ఇరువాడ రైతులు బుధవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రైతులు తాతారావు, గురువులు, దళిత నేత పాల్తేటి పెంటారావు తదితరులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన బలిరెడ్డి అప్పారావు సర్వే నెంబర్లు 103, 106లలో ఆక్రమణలు జరిగాయని చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం రెవెన్యూ అధికారులు పొలాలకు వెళ్లే మార్గంలో ట్రెంచ్ తవ్వారని ఆరోపించారు. అయితే ట్రెంచ్ ప్రభుత్వ భూముల్లో కాకుండా జాతీయ రహదారికి అనుకొని ఉన్న జిరాయితీ సర్వే నెంబరు 108లో తవ్వడం తగదని వాపోయారు. ఈ కారణంగా పొలాల్లో దమ్ముల సమయంలో తామంతా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా వారు కోరారు.

కిరండోల్ రైళ్లు దంతెవాడ వరకే...

విశాఖపట్నం, ఆగస్టు 7: కేకే లైన్‌లో కిరండోల్ ప్రాంతంలో ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్నందున విశాఖ- కిరండోల్ మధ్య నడుస్తున్న పాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ల గమ్యాలను దంతెవాడ వరకు కుదించినట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండోల్ పాసింజర్ (08551) రైలు, విశాఖ- కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18514) రైళ్లు ఈనె ల ఎనిమిది నుంచి 14వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండోల్- విశాఖ పాసింజర్ (08552), కిరండోల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18513) రైళ్లు ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు దంతెవాడ నుంచి బయలుదేరి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండోల్ మధ్య రాకపోకలను తాత్కాలికంగా రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

మళ్లింపు మార్గంలో సమతా ఎక్స్‌ప్రెస్

నాగపూర్ డివిజన్‌లో నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ, నిజాముద్దీన్ సమతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు మళ్లింపు మార్గంలో నడుస్తాయని సీనియర్ డీసీఎం తెలిపారు. ఈ ఎక్స్‌ప్రెస్ (12807) ఈనెల ఎనిమిదిన వ యా విజయవాడ, నాగపూర్ మీదుగా, తిరుగు ప్రయాణంలోని నిజాముద్దీన్-విశాఖ సమతా ఎక్స్‌ప్రెస్ (12808) ఈనెల 9న వయా నాగపూర్, విజయవాడ మీదుగా నడుస్తాయని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

శిథిలావస్థలో గవరపాలెం వెటర్నరీ డిస్పెన్సరీ భవనం

- బీటలు వారిన గోడలు
- పెచ్చులూడి పడుతున్న శ్లాబు
- భయం.. భయంగా.. సిబ్బంది విధులు
- పశువులను తెచ్చే రైతులకూ అసౌకర్యాలే


బీటలు వారి ఉన్న ఆసుపత్రి లోపలి భాగం గోడలు


శ్లాబ్ పెచ్చులూడి కిందపడిన దృశ్యం

కొత్తూరు, ఆగస్టు 7: అనకాపల్లి పట్టణంలోని గవరపాలెం శివారున ఉన్న ప్రభుత్వ వెటర్నరీ డిస్పెన్సరీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బితుకు బితుకుమంటూ సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వివిధ పనులపై వచ్చే పాడి రైతులు అసౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ఆసుపత్రి భవనాన్ని 1989లో అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న దాడి వీరభద్రరావు ప్రారంభించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో పాడికి అధిక శాతం రైతులు మక్కువ చూపేవారు. పాడి రైతులకు సౌకర్యవంతంగా ఉండే విధంగా దీని నిర్మాణం చేట్టారు. ప్రతి రోజూ పెద్ద సంఖ్యలో పశువులు, జంతువులను ఈ ఆసుపత్రికి తీసుకువచ్చి ఉచితంగా వైద్యం చేయించుకునేవారు. కాగా, కాలక్రమేణా ఈ భవనం గత ఐదేళ్ల నుంచి శిథిలావస్థకు చేరుకోవడంతో లోపల భాగంలో శ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. దీని వల్ల మందులు భద్రపరిచేందుకు కూడా వీలు లేకుండా పోయింది. అంతేకాకుండా సిబ్బంది కూడా పెచ్చులు ఊడి తమపై ఎక్కడ పడతాయోనని భయాందోళన చెందుతున్నారు.

ఇదిలావుంటే, ప్రతిరోజూ 30 పాడి పశువులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. అయితే పశువులకు వైద్యం అందించేందుకు సరైన షెడ్డు లేకపోవడంతో రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు కూర్చునేందుకు కూడా వసతి సౌకర్యాలు లేదు. ఆరు పంచాయతీల పాడి పశువులకు ఈ ఆసుపత్రి నుంచే వైద్యం అందిస్తున్నారు. అనకాపల్లి మండలంలోని బవులవాడ, తుమ్మపాల, పిసినికాడ, సత్యనారాయణపురం, కొత్తూరు, గవరపాలెం అర్బన్ పంచాయతీల్లో పాడి పశువులకు ఉచితంగా సేవలు అందిస్తున్నారు. కాగా ఆసుపత్రిలో ఒక వైద్యుడు, ఒక ఆఫీసు సబ్ ఆర్డినేటర్ ఉన్నారు. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉంది. ఉన్నతాధికారులు ఇక్కడి సమస్యలపై తక్షణమే ప్రత్యేక దృష్టి సారించాల్సిందిగా పాడి రైతులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న గవరపాలెం పశువైద్యశాల భవనం

ఉన్నతాధికారుల దృష్టికి భవనం దుస్థితి



ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అంతేకాకుండా ఇక్కడ సమస్యలపై నివేదిక పంపించాం. రోజుకి సుమారు 35 వరకు పశువులను చూలు, సాధారణ తనిఖీలు, సాధారణ వ్యాధులపై చికిత్సకు తీసుకువస్తారు.

- డాక్టర్ అనిల్ కుమార్, పశువైద్యాధికారి

డిగ్రీ కళాశాలలో నాయకత్వ లక్షణాలపై ఆన్‌లైన్ సదస్సు

- విద్యార్థులకు దిశానిర్దేశం చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా


సదస్సులో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు


ఆన్‌లైన్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ మోహన్ కందా

ఎలమంచిలి, ఆగస్టు 7: పట్టణంలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'నాయకత్వం, నైతికతల మధ్య సమన్వయం' అంశంపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్త ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోహన్ కందా విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన నాయకత్వ లక్షణాలు, వాటి యొక్క విలువల గురించి తెలియజేశారు. వివిధ అంశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు మోహన్‌కందా సమాధానాలు ఇచ్చారు. ఈ సదస్సుకు రెండు తెలుగు రాష్ట్రాల డిగ్రీ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు హాజరయ్యారు. ఎలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, వాణిజ్యశాస్త్ర విభాగాధిపతి రేఖా రామారావు, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు వి.చిట్టిబాబు, ఎం.కిశోర్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వలస కార్మికుల ప్రయాణం


ఆటో తొట్టిలో కూర్చొని విధులకు వెళ్తున్న వలస కార్మికులు (ఫైల్)

పరవాడ, ఆగస్టు 7 : మండల పరిధిలో గల ఫార్మాసిటీ, సింహాద్రి ఎన్టీపీసీ, స్థానిక ఇండస్ట్రియల్ పార్కులోని పరిశ్రమల్లో పనిచేస్తున్న వలస కార్మికులకు కనీస రవాణా సౌకర్యాలు కల్పించడం లేదు. ఇతర రాష్ట్రాల నుంచి పొట్టకూటి కోసం వచ్చిన వారి బతుకులకు గ్యారెంటీ లేకుండా పోతుంది. తొట్టి ఆటోల్లో, వ్యాన్లలో ప్రమాదకరంగా ప్రయాణించే పరిస్థితి ఎదురౌతోంది. సంబంధిత కాంట్రాక్టర్లు కార్మికులకు రవాణా సౌకర్యం కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా మంది కార్మికులు తొట్టి ఆటోల్లో వేలాడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఫార్మాసిటీకి వెళ్లే రహదారితో పాటు ఎన్టీపీసీకి వెళ్లే రహదారిలో వలస కార్మికులు వాహనాల్లో వేలాడుతూ వెళ్తున్న దృశ్యాలను చూస్తున్నవారు ఎప్పుడు ఏం జరుగుతుందోనని హడలిపోతున్నారు. వలస కార్మికులకు రవాణా సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

- రేషన్ డిపోల ద్వారా సరుకుల నిర్ణయంపై డీలర్లు హర్షం


క్షీరాభిషేకం చేస్తున్న డీలర్లు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఇక్కడి డీసీ ఎంఎస్ కార్యాలయం ఆవరణలో బుధవారం రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. అమరావతిలో సోమవారం జరిగిన కలెక్టర్ల సమీక్షలో పౌర సరఫరాల విషయమై ఆలోచన చేసినప్పుడు ఎండీయూ వ్యవస్థ వల్ల అనేక రకమైన ఇబ్బందులు ప్రజలు ఎదుర్కొంటున్నారని వారు గుర్తించారన్నారు. అందువల్ల ప్రజలకు రేషన్ సరుకులు రేషన్ డిపోల ద్వారానే పంపిణీ చేయాలని సీఎం చంద్రబాబు చర్యలు చేపట్టేందుకు ముందుకు వచ్చారని పేర్కొంటూ వారంతా హర్షం వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు శేషు, పెంటకోట నాయుడు, ఈశ్వరరావు, రాజు, ఎర్రనాయుడు, రజని, సత్యవతి, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రెపె ఛేజ్ హీట్స్‌లో ఎర్రాజీ జ్యోతి

- సెమీ ఫైనల్స్‌కు చేరే అవకాశం


పోటీలు పాల్గొన్న జ్యోతి యర్రాజీ (గ్రీన్ మార్క్ వద్ద)

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 7: పారిస్ విశ్వ క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌లో విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి మరో సువర్ణ అవకాశం లభించింది. బుధవారం జరిగిన 100 మీ. హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్-4 పాల్గొన్న జ్యోతి ఏడో స్థానంతో నిరాశపరిచింది. దీంతో సెమీ ఫైనల్స్‌కు నేరుగా అర్హత సాధించలేకపోయింది. అయితే గురువారం జరగనున్న రెపెచేజ్ హీట్-1లో పోటీపడే అవకాశం దక్కింది. (ఇంటర్నేషనల్ కెరీర్‌లో అత్యుత్తమ టైమింగ్ నెలకొల్పిన అథ్లెట్లకు సెమీస్‌కు చేరేందుకు టెక్నికల్ కమిటీ కల్పించే ఈ అవకాశాన్ని రెపె ఛేజ్ అంటారు). ఈ హీట్-1లో జ్యోతితో కలిపి ఎనిమిది మంది పోటీపడనున్నారు.

13.16 సెకన్లలో రేస్ పూర్తి

బుధవారం జరిగిన రౌండ్-1 హీట్-4 జమైకా, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, రష్యా, ఫ్రాన్స్, హంగేరి, వెనుజులాకు చెందిన బలమైన ప్రత్యర్థులతో పోటీపడిన జ్యోతి ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఈ హీట్స్‌లో ఎనిమిది మంది పోటీపడగా జ్యోతి ఏడోస్థానంలో నిలిచింది. తొలిస్థానం సాధించిన డేనియల్ విలియమ్స్ (జమైకా) తన రేస్‌ను 12.59 సెకన్లలో పూర్తిచేయగా ఏడోస్థానంలో నిలిచిన ఎర్రాజీ జ్యోతి 13.16 సెకన్లలో పూర్తి చేసింది. ఒలింపిక్స్ ముందు చైనాలోని చెంగుడులో జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల టైమింగ్‌తో అద్భుత ఫాంలో ఉన్న జ్యోతి ఒలింపిక్స్ హీట్స్‌లో 100మీ. హర్డిల్స్‌కు 13.16 సెకన్ల సమయం తీసుకుంది. కాగా గురువారం జరిగే రెపె ఛేజ్‌లో రాణించాలని క్రీడా ప్రతినిధులు ఆశిస్తున్నారు.

సీతాకోకచిలుక ప్రాజెక్టుతో గిరిజనులకు ఉపాధి

- పర్యాటకులకు మధురానుభూతిని కల్పిస్తాం..
- కాఫీహౌస్ పనులను పరిశీలించిన విశాఖ డీఎఫ్‌వో అనంతశంకర్


కాఫీహౌస్ పనులను పరిశీలించి సూచనలిస్తున్న డీఎఫ్‌వో అనంతశంకర్

అనంతగిరి, ఆగస్టు 7 : సీతాకోకచిలుక ప్రాజెక్టుతో గిరిజనులకు ఉపాధి కల్పిస్తామని విశాఖపట్నం డీఎఫ్‌వో అనంత్‌శంకర్ అన్నారు. బుధవారం మండలంలోని మర్రిగుడ సమీపంలోని చాపరాయి వద్ద సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో జరుగుతున్న సీతాకోక చిలుక ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. 5.5 కోట్ల ప్రాజెక్టు పర్యాటకులకు మరపురాని అనుభూతి కలిగేలా ఉండబోతుందన్నారు. సోలార్ ఆర్వోప్లాంట్, కాఫీ హౌస్ ఎదురుగా ఉన్న ప్రదేశంలోని పర్యాటకులు సౌకర్యార్థం టెంట్స్ ఏర్పాటు చేయాలని, అలాగే పార్కింగ్ సదుపాయం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

అనంతరం మర్రిగుడ వీఎస్ఎస్ సభ్యులతో కొంతసేపు ముచ్చటించారు. అడవులను నాశనం చేయకుండా జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ.. గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని గిరిజన నిరుద్యోగుల అభివృద్ధికి, వన్యప్రాణులు సంరక్షణకు ఉపయోగించనున్నట్టు డీఎఫ్‌వో అనంత్‌శంకర్ తెలిపారు. ఆయన వెంట సబ్ డీఎఫ్‌వో ధర్మరక్షిత్, రేంజర్ దుర్గాప్రసాద్, సెక్షన్ అధికారులు సీతారాం పాల్గొన్నారు.

పంద్రాగస్టు పరేడ్‌కు దివ్యనయన ఎంపిక


దివ్యనయన

దేవరాపల్లి, ఆగస్టు 7: విజయవాడలో ఈనెల 15న రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం పరేడ్‌కు దేవరాపల్లి మండలం చిననందిపల్లికి చెందిన సబ్బవరపు దివ్యనయన ఎంపికైంది. ఈ విషయాన్ని ఆమె తండ్రి రమణమూర్తి బుధవారం తెలిపారు. ప్రస్తుతం దివ్యనయన విశాఖలోని రఘు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అదే కళాశాలలో ఎన్‌సీసీలో చేరింది. ఎన్‌సీసీలో ప్రతిభ కనబర్చడంతో ఈ అవకాశం దక్కిందని రమణమూర్తి చెప్పారు. అలాగే జనవరి 26న ఢిల్లీలో గణతంత్ర వేడుక పరేడ్‌లో సైతం పాల్గొనే అవకాశం దివ్యకు లభించినట్టు చెప్పారు. ఈ ప్రాంత అమ్మాయికి అవకాశం రావడం స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

9న నూకాంబిక ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అనకాపల్లి టౌన్, ఆగస్టు 7 : ఉత్తరాంధ్రుల ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి బాలాలయంలో ఈ నెల తొమ్మిదో తేదీ శ్రావణమాసం మొదటి శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఉచితంగా నిర్వహించనున్నామని ఆలయ ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. వ్రతం చేయదలచిన భక్తులు ముందుగా పేర్లు కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, ఈ నెల 11న సప్తమి స్వాతి నక్షత్రంతో కూడిన మొదటి ఆదివారం విశేషమైన రోజు కావడంతో బాలాలయంలో అమ్మవారికి నింబ పత్రములు (వేప ఆకులు)తో ప్రత్యేక అలంకరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

దివ్యాంగ బాలల కోసం రూ.37.86 లక్షలు మంజూరు

- జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల

చోడవరం, ఆగస్టు 7: జిల్లాలో సమగ్ర శిక్షా భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగ బాలలకు రూ.37 లక్షల 86 వేల రూపాయలు ప్రోత్సాహకాలు మంజూరైనట్టు జిల్లా సహిత విద్య సమన్వయకర్త శకుంతల తెలిపారు. బుధవారం ఆమె స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించి దివ్యాంగ బాలలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 1485 మంది దివ్యాంగ బాలబాలికలకు రవాణా ఖర్చులు, గృహ అలవెన్సు, బాలికల స్టైపెండ్‌ల కింద నిధులు మంజూరయ్యాయని, వీటిని వారి ఖాతాలతో జమ చేశామన్నారు. దివ్యాంగ బాలలకు భవిత కేంద్రాల ద్వారా సాయం అందుతుందన్నారు. ఈ సందర్భంగా బాలలకు ఇచ్చిన ట్యాబ్‌ల పనితీరును ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులు సత్యనారాయణ, రమేష్, ఫిజియోథెరపిస్టు లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

- ఆర్టీసీ బస్టాండ్‌లో నార్కోటిక్ డాగ్ తనిఖీలు
- పెదబొడ్డేపల్లి, బలిఘట్టంలో వాహన సోదాలు


ఆర్టీసీ బస్టాండ్‌లో బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుధాకరరావు

నర్సీపట్నం, ఆగస్టు 7: గంజాయి అక్రమ రవాణా కట్టడిలో భాగంగా పట్టణ పోలీసులు విస్తృత తనిఖీలు చేశారు. బుధవారం మాదకద్రవ్యాలను పసిగట్టే పోలీసు శునకంతో ఎస్సై సుధాకరరావు ఆర్టీసీ బస్టాండ్‌లోని ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేశారు. బలిఘట్టం, పెదబొడ్డేపల్లి శివారులో బైక్‌లు, కార్లు తనిఖీ చేశారు. ఏజెన్సీ నుంచి విశాఖపట్నం, తుని వైపు వెళ్లే అన్ని వాహనాలలో క్షుణ్ణంగా సోదాలు చేశారు. మాదక ద్రవ్యాల బారిన పడకుండా ఉండాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు పటిష్ఠ ఏర్పాట్లు

- రిటర్నింగ్ అధికారి మయూర్ అశోక్


మాట్లాడుతున్న జేసీ అశోక్‌కుమార్

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30వ తేదీన జరుగనున్న ఎమ్మెల్సీ ఉపఎన్నిక నిర్వహణకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని శాంతి భద్రతల సమస్యలు ఏర్పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి జిల్లా ఏఆర్‌ఓలు, పోలీసు అధికా రులను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖ జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల గుర్తింపు, జాబితాల రూపకల్పన, బ్యాలెట్ పేపరు తయారీ, గుర్తుల కేటాయింపు పై సూచనలు ఇచ్చారు. సాంకేతికపరమైన విషయాలలో ఆచితూచి వ్యవహరిం చాలన్నారు. సమావేశంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామారాజు జిల్లాల ఏఆర్వోలు కె.మోహన్‌కుమార్, వై.శ్రీనివాసరావు, కె.పద్మావతి పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వారం రోజుల్లో సోప్ యూనిట్

జీసీసీ ఎండీ కల్పనాకుమారి ఆదేశం


సబ్బులను పరిశీలిస్తున్న ఎండీ కల్పనాకుమారి

అరకులోయ, ఆగస్టు 7 : మూడేళ్లుగా మూతబడిన అరకు సోప్ యూనిట్‌ను వారం రోజుల్లో తెరవాలని జీసీసీ ఎండీ కల్పనాకుమారి ఆదేశించారు. బుధవారం సాయంత్రం ఐటీడీఏ పీవో అభిషేక్‌తో కలిసి అరకులోయకు విచ్చేసిన ఆమె, ముందుగా హట్టగుడలోని నాంది సంస్థకు చెందిన కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలించారు. అనంతరం సోప్ యూనిట్‌క విచ్చేశారు. శిక్షణ పొందిన సిబ్బందిని ఉంచి యూడా యూనిట్‌ను నిర్వహించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరును మార్చుకోవాలని, సంస్థ ఉన్నతికి అందరూ అంకితభావంతో పని చేయాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. వారం రోజుల్లో సోప్ యూనిట్ తెరవకపోతే ఇంటికి పంపేస్తానని యూనిట్ ఇన్‌చార్జిని హెచ్చరించారు. కార్మికులతో మాట్లాడుతూ జీతాలు వస్తున్నాయా? లేదా? అని ఆరా తీశారు. సోప్ యూనిట్‌ను తెరచిన వెంటనే కార్మికులంతా చక్కగా పని చేయాలన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్, జీసీసీ జీఎం (మార్కెటింగ్) శ్రీనివాసరావు, విజిలెన్స్ అధికారి ఉమాదేవి, పాడేరు డీఎం సింహాచలం, పాడేరు, అరకులోయ బ్రాంచి మేనేజర్లు బుక్కా వెంకటేష్, శ్రీనివాసరావు, సోప్ యూనిట్ మేనేజర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అఖిలభారత గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

▸▸ అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

పాడేరు రూరల్, ఆగస్టు 7: చింతపల్లి మండల కేంద్రంలో నిర్వహించనున్న జిల్లా స్థాయి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రతినిధులు ముఖి శేషాద్రి, బోయపల్లి సింహాచలం, వంతాల రామారావు పిలుపునిచ్చారు. ఈ వేడుకల నిర్వహణపై బుధవారం గిరిజన ఉద్యోగ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీల ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు, రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పరిరక్షణ, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై రాష్ట్ర స్థాయి ఆదివాసీ మేధావుల ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. మొదటిగా ఆదివాసీ పతాకావిష్కరణ అనంతరం వక్తల ప్రసంగం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు అడ్వకేట్ డి.ఉమామహేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ జాతీయ సభ్యులు మడివి నెహ్రూ, జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి టి.బాబూరావు నాయుడు, గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పీవీ.రమణ తదితర మేధావులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు.

గర్భిణులు ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలి

▸▸ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు



బాలింతలకు రొట్టెలు పంపిణీ చేస్తున్న సూపరింటెండెంట్ చంద్రశేఖరరావు

చింతపల్లి, ఆగస్టు 7: గర్భిణులు, బాలింతలు ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖరరావు సూచించారు. బుధవారం తల్లిపాల వారోత్సవాలు ముగింపును పురస్కరించుకుని ఏరియా ఆస్పత్రి వైద్యులు, చౌడుపల్లి గ్రామ పంచాయతీ కేంద్రంలో ఐసీడీఎస్ అధికారులు వేర్వేరుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఏరియా ఆస్పత్రిలో బాలింతలు, గర్భిణులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చౌడుపల్లిలో సీమంతాలు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ శిశువుల్లో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు తల్లిపాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిశు జన్మించిన తొలి మూడు రోజులు తల్లిపాలు కచ్చితంగా పట్టించాలన్నారు. గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలన్నారు. అనారోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ వైద్య నిపుణులు ఎస్ఎస్‌వీ సుధాశారద, ఎస్.ప్రవీణ, చిన్నపిల్లల వైద్య నిపుణులు జి.ప్రభావతి, వైద్యులు ఇందిరాప్రియదర్శిని, నర్సింగ్ సూపరింటెండెంట్ మాత పద్మావతి, ఐసీడీఎస్ ఏసీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

గరుగుబిల్లి వంతెన నిర్మించాలని నిరసన



వంతెన నిర్మాణ స్థలంలో నిరసన తెలుపుతున్న గిరిజనులు, నాయకులు

అనంతగిరి, ఆగస్టు 7: మండలంలోని గరుగుబిల్లి వద్ద రాళ్లగెడ్డపై అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వంతెన నిర్మాణ స్థలంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలోని సుమారు రూ.2 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టారని, 60 శాతం వరకు పనులు పూర్తి చేశారని చెప్పారు. ప్రభుత్వం మారడంతో ఈ నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదని, దీంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణ పనులను పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకు రావాలని, గిరిజనులకు రవాణా కష్టాలను తీర్చాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు రాకోటి రాములు, గిరిజనులు పాల్గొన్నారు.

సిగినాపల్లి రంగురాళ్ల క్వారీపై ప్రత్యేక నిఘా

▸▸ 14 మందిపై బైండోవర్ కేసులు... బేస్ క్యాంప్ ఏర్పాటు

చింతపల్లి, ఆగస్టు 7: మండలంలోని సిగినాపల్లి రంగురాళ్ల క్వారీపై ప్రత్యేక నిఘా పెట్టామని పెదవలస అటవీ శాఖ రేంజ్ అధికారి కె. శివరంజని అన్నారు. బుధవారం రేంజ్ కార్యాలయంలో అటవీ శాఖ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వర్షాలు కురుస్తుండడంతో సిగినాపల్లి రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు నిర్వహించే అవకాశం ఉండడంతో అక్కడ 24గంటలు గస్తీ నిర్వహిస్తున్నారన్నారు. క్వారీలో తవ్వకాలను నియంత్రించేందుకు ప్రత్యేక బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. గతంలో తవ్వకాలు నిర్వహించిన సొరంగాలను పూర్తిగా మూయించివేశామన్నారు. గతంలో క్వారీలో తవ్వకాలు నిర్వహించిన 14మందిపై పోలీసు శాఖ సహకారంతో బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. మరికొంత మందిపై బైండోవర్ కేసులు పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రంగురాళ్ల వ్యాపారుల కదలికలపై నిఘా పెట్టామన్నారు. క్వారీ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరించినా చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపారులకు కౌన్సెలింగ్ చేసి విడిచిపెట్టామని, తవ్వకాలను ప్రోత్సహిస్తే కేసులు పెడతామన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌బీవో గోపి, అటవీ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఉనికిని పాలకులు కాపాడాలి

▸▸ దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సమరెడ్డి మాణిక్యం

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆదివాసీల ఉనికిని పాలకులు కాపాడాలని దండకారణ్య ఉద్యోగ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐక్యరాజ్య సమితి సూచనలతో గత మూడు దశాబ్దాలుగా ప్రతి ఏటా ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారని, ఈ క్రమంలో దేశంలోని ఆదివాసీల ఉనికి, అస్థిత్వం, స్వేచ్ఛగా బతికే హక్కును పాలకులు కాపాడాలని కోరారు. సమాజంలో ఎటువంటి సంస్కరణలు, పారిశ్రామికీకరణ, మైనింగ్ వంటివి జరిగినా ఆదివాసీలే నిరాశ్రయులు అవుతున్నారని వాపోయారు. అభివృద్ధి ఫలాలను వేరొకరు అనుభవిస్తుండగా, అందుకు భిన్నంగా ఆదివాసీలు తమ జీవితాలను కోల్పోతున్నారన్నారు. ఈ క్రమంలో ఆదివాసీ వేడుకలకు అర్థం, సార్థకత లేని పరిస్థితులు కొనసాగడం విచారకరమన్నారు. చత్తీస్‌ఘడ్‌లో నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా అక్కడ ఆదివాసీలపై జరుగుతున్న హింస, ఇతర అఘాయిత్యాలను ఇటీవల హైదరాబాద్‌లో మీడియా సమక్షంలో బాధిత ఆదివాసీలు తెలిపారని మాణిక్యం గుర్తు చేశారు. ఆదివాసీల మనుగడ కోల్పోకుండా వారి అభివృద్ధి, సంక్షేమ, చట్టాలు సక్రమంగా అమలయ్యేలా పాలకులు పటిష్ఠ చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ క్రమంలో వివిధ రాష్ట్రాల్లో ఆదివాసీలు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలను ఉద్యోగ సమితి మరో నేత చెండా కేశవరావు వివరించారు. కార్యక్రమంలో దండకార్యణ ఉద్యోగ సమితి నేతలు రాజాబాబు, కిల్లో భీమరాజు, జి.ధనుంజయ్, కె.కొండలరావు, వి.ప్రసాద్ పాల్గొన్నారు.

హైవే నిర్మాణంలో నిర్వాసితులకు అన్యాయం

▸▸ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధిత గిరిజనుల ధర్నా



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

చింతపల్లి, ఆగస్టు 7: జాతీయ రహదారి నిర్మాణంలో నిర్వాసితులకు అధికారులు తీరని అన్యాయం చేశారని లంబసింగి గ్రామానికి చెందిన బాధిత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పాడేరు సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. చర్యల్లో బాధితులకు న్యాయం చేసేందుకు అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు విలేకరులతో మాట్లాడుతూ లంబసింగి గ్రామంలో జాతీయ రహదారి విస్తరణలో గృహాలు, భూములు కోల్పోయిన బాధితులకు మార్కెట్ ధర కంటే మూడు రెట్లు అధికంగా చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారుల మాటలు నమ్మి ఎన్‌వోసీపై సంతకాలు చేశామన్నారు. ప్రస్తుతం పక్కా గృహాలు కోల్పోయిన బాధితులకు 30శాతం పరిహారం మాత్రమే చెల్లించారన్నారు. వారం రోజుల కిందట మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో అధికారులు విచారణకు సబ్ కలెక్టర్ కార్యాలయానికి రమ్మనడంతో వెళ్లామన్నారు. పరిహారం చెల్లింపుపై అధికారులు ఎటువంటి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. జాతీయ రహదారి విస్తరణకు తాము వ్యతిరేకం కామన్నారు. లేనిపక్షంలో జాతీయ రహదారి నిర్మాణాలను అడ్డుకుంటామన్నారు. జాతీయ రహదారులు, రెవెన్యూ అధికారుల తీరుపై అమరావతి వెళ్లి ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

గిరిజనుల హక్కులపై అవగాహన సదస్సులు

▸▸ సమత కో-ఆర్డినేటర్ కె.సతీష్‌కుమార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

అరకులోయ, ఆగస్టు 7: ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని సమత కో-ఆర్డినేటర్ కె.సతీష్‌కుమార్ తెలిపారు. అరకులోయ, అనంతగిరి మండలాల పరిధిలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమోన్నత బాలికల పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మూడు రోజులుగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సమత సంస్థ గిరిజనుల వనరులు, హక్కుల పరిరక్షణ కోసం చేసిన ఉద్యమాలను వివరించారు. గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన హక్కుల చట్టం-1996, అటవీహక్కుల చట్టం-2006 పటిష్ఠంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమత నిర్వాహకులు ఎ.లక్ష్మి, జి.రాధ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పశుగణనపై ర్యాలీ చేపట్టిన పశు వైద్యులు, సిబ్బంది

పశువుల పెంపకంతో ఆర్థిక స్థిరత్వం

▸▸ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి నరసింహులు

పాడేరు రూరల్, ఆగస్టు 7: పశువుల పెంపకంతో ఆర్థిక స్థిరత్వం సాధించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి సిహెచ్.నరసింహులు చెప్పారు. స్థానిక జిల్లా పశుసంవర్థక శాఖ కార్యాలయంలో బుధవారం 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక రంగాన్ని పరిశ్రమగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పశువులు, కోళ్ల పరిశ్రమలలో నాణ్యతను మెరుగుపర్చేందుకు, వ్యాధులను నియంత్రించేందుకు వివిధ పథకాలు ప్రారంభించినట్టు చెప్పారు. పశుగణన ప్రారంభించినప్పటి నుంచి ప్రతీ ఐదేళ్లకు ఓసారి నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. పూర్తి పశుగణన ఫిబ్రవరి 2025లో చేయనున్నట్టు వివరించారు. పశువుల గణన చేసే వారు పశువులను వయస్సు, లింగం, ప్రయోజనాల ఆధారంగా గుర్తించాలన్నారు. ఎన్యుమరేటర్లు రోజుకు 40 నుంచి 45 పశు యజమానుల గృహాలను సర్వే చేయాలని ఆదేశించారు. అనంతరం పశుసంవర్ధక శాఖ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు పశుసంవర్థక శాఖ ఉప సంచాలకులు రాజా రవికుమార్, పశు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్, ఆగస్టు 7: పాడేరు డివిజన్‌లోని వివిధ మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవీఎస్ఎం.అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లోని ఫీడర్ మరమ్మతుల కోసం వివిధ మండలాల సబ్ స్టేషన్‌ల పరిధిలో కొన్ని గ్రామాలకు మాత్రమే ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని చెప్పారు. హుకుంపేట సబ్ స్టేషన్ పరిధిలోని సంతారి 11 కేవీ ఫీడర్‌లోని తాడిపుట్టు, కొట్నాపల్లి, పెదగరువు, రంగశీల, రావ, దారగెడ్డ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. అదే విధంగా చింతపల్లి మండలం లంబసింగి సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ రాజుపాకలు ఫీడర్‌లోని చిత్రాలగుప్ప, పెదబరడ, లబ్బంగి, భీమునిమెట్ట గ్రామాల్లో, ముంచంగిపుట్టు మండలం మాకవరం 11 కేవీ రూరల్ ఫీడర్‌లోని కించాయిపుట్టు, దారాపల్లి, సరియాపుట్టు, మజ్జిగూడ గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. అరకు సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

పాడేరు రూరల్, ఆగస్టు 7: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాల దుర్వినియోగం, నివారణపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. యువత మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలు వినియోగించే విద్యార్థుల సంఖ్య క్రమేపీ పెరుగుతుందన్నారు. అటువంటి వాటికి అలవాటు పడి విద్యార్థులు అమూల్యమైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఏకాగ్రత, జ్ఞాపక శక్తి తగ్గిపోయి ఆత్మస్థర్యాన్ని కోల్పోతారని వివరించారు. అటువంటి యువతను మంచి మార్గంలో నడిపించేందుకు విద్యావంతులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.వెంకటశర్మ, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.గణేష్, జి.గౌరీశంకరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో మహ్మాతుల విగ్రహాల ప్రతిష్ఠ



పాఠశాల ఆవరణలో మహాత్ముల విగ్రహాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతగిరి, ఆగస్టు 7: మండలంలోని భీంపోలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ బాలికల పాఠశాలలోని బుధవారం మహ్మాతుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలోని హెచ్ఎం ఉషారాణి మాట్లాడుతూ మహనీయుల సేవలు గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయుల సహకారంతో సరస్వతీ, సర్వేపల్లి రాధాకృష్ణన్, మహత్మాగాంధీ, బీఆర్.అంబేడ్కర్, గౌతమ బుద్ధుడు విగ్రహాల అంగరంగవైభవంగా ప్రతిష్ఠించామని చెప్పారు. విగ్రహాలు ఏర్పాటుకు దాతల సహకారాన్ని మరువలేమని చెప్పారు. పాఠశాలలోని మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు శ్రీకారం చూడతామన్నారు. ఈ కార్యక్రమంలోని సీఆర్పీ అంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల వద్ద నీటి నిల్వలు ఉంటే వ్యాధుల ముప్పు

▸▸ మలేరియా విభాగం జిల్లా అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు

ఎస్.రాయవరం,ఆగస్టు 7 : ప్రజలంతా తమ ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా విభాగం జిల్లా ఇన్‌చార్జి అధికారి పీజేఎంఆర్‌పీ నాయుడు సూచించారు. మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధి ఉప్పరాపల్లి గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. పలు ఇళ్ల వద్ద పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవడంతో పాటు నీటిని భద్రపర్చుకునే వాటిపై మూతలు ఉండేలా చూసుకోవాలన్నారు. అలా చేయడం వల్ల మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, ఫైలేరియా తదితర వ్యాధుల బారిన పడకుండా ఉండ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి టి.నాగేశ్వరరావు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లీనిక్ క్లస్టర్ పర్యవేక్షకుడు డాక్టర్ పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్, కమ్యునిటీ హెల్త్ ఆఫీసర్ కె.శ్రావణి, హెల్త్ సెక్రటరీ జి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఉప్పరాపల్లిలో నీటిని పరిశీలిస్తున్న పీజేఎంఆర్‌పీ నాయుడు

☛ సంక్షిప్తంగా..

9న అత్యవసర రక్తదాన శిబిరాలు నిర్వహించండి: కలెక్టర్

పాడేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఈ నెల 9వ తేదీన అత్యవసర రక్తదాన శిబిరాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ బుధవారం రాత్రి ప్రకటించారు. జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో అవసరం మేరకు రక్త నిల్వలు లేవని తెలిసిందని, అందుకు వల్ల ఈ నెల 9న ఆదివాసీ దినోత్సవం రోజు పాడేరు ఐటీడీఏ కార్యాలయం, చింతపల్లి బస్ కాంప్లెక్స్‌లో రక్తదాన శిబిరాలను నిర్వహించి రక్తాన్ని సేకరించాలన్నారు. అలాగే రక్తదాన శిబిరానికి అధిక సంఖ్యలో దాతలు రావాలని కలెక్టర్ కోరారు.

అటవీ శాఖ రేంజర్‌గా అప్పారావు



చింతపల్లి, ఆగస్టు 7: అటవీ శాఖ రేంజ్ అధికారిగా బి.అప్పారావు నియమితులయ్యారు. రాజమహేంద్రవరం అటవీ శాఖ పరిశోధన కేంద్రంలో డిప్యూటీ రేంజర్‌గా పని చేస్తున్న అప్పారావును ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమించారు. ఈ మేరకు ఆయన బుధవారం విధుల్లో చేరారు.

డిగ్రీ కళాశాల విద్యార్థులకు తరగతి గదులు అప్పగించండి

పాడేరు రూరల్, ఆగస్టు 7: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూంలను త్వరితగతిన ఖాళీ చేసి కళాశాల విద్యార్థులకు అప్పగించి వారి విద్యకు ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో బుధవారం తెరిచి పరిశీలించారు. ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా ఈవీఎంలను విభజించి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా వాటితో పాటు మెటీరియల్‌ను వేరొక హౌస్‌కు తరలించాలని, బీసీ కేటగిరీల ఈవీఎంలు బెంగుళూరులోని బెల్ కేంద్రానికి పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజే.అభిషేక్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గణేష్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వనుము చిట్టిబ్బాయి, ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

అరకులోయ, ఆగస్టు 7: స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని జయమ్మ మెమోరియల్ ట్రస్టు ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి సమస్యలపై అప్రమత్తత అవసరం

చింతపల్లి, ఆగస్టు 7: కంటి సమస్యలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఏరియా ఆస్పత్రి వైద్యులు గాలి జగన్ సూచించారు. బుధవారం విద్యార్థినులకు ప్రత్యేక కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో కళ్ల కలకలు వ్యాప్తి చెందాయని, ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని చెప్పారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందాలని సూచించారు. స్పష్టంగా కనిపించకపోయినా, కన్నీరు వచ్చినా, కళ్లు ఎరుపు రంగులోకి మారినా వెంటనే ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకోవాలన్నారు. కంటి సమస్యలపై అశ్రద్ధ చేయరాదన్నారు.

వ్యాధులు బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి: డాక్టర్ శిరీష

ముంచంగిపుట్టు, ఆగస్టు 7: వ్యాధుల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కిలగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శిరీష సూచించారు. మండలంలోని బంగారుమెట్ట గిరిజన సంక్షేమ బాలిక పాఠశాల వసతి గృహం ఆవరణలో వ్యాధులపై అవగాహన కల్పించేందుకు బుధవారం కళాజాత ఏర్పాటు చేశారు. పాటలు, నృత్య రూపంలో పలు రకాల వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ఈ కళాజాత సాగింది. ప్రధానంగా సికిల్‌సెల్ ఎనీమియా, డయేరియా, మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వాటి బారిన పడకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సకాలంలో రేషన్ పంపిణీ చేయండి

చింతపల్లి, ఆగస్టు 7: డీఆర్ డిపోలు, వసతి గృహాలకు సకాలంలో రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ టి.రామకృష్ణ ఆదేశించారు. స్థానిక గిరిజన సహకార సంస్థ గోదామును బుధవారం సందర్శించారు. రేషన్ బియ్యం నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఎండీయూ వాహనాల ద్వారా ఒకటో తేదీ నుంచి రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభించేందుకు ముందుగానే డిపోలకు సరఫరాలు చేయాలన్నారు. కచ్చితమైన కొలతలతో బియ్యం లబ్ధిదారులకు అందజేయాలన్నారు. జీసీసీ ద్వారా నాసిరకం నిత్యావసర సరకులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో గోదాము సూపరింటెండెంట్ రమణమూర్తి పాల్గొన్నారు.

ఉద్యాన మొక్కలు నాటాలి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 8: గిరిజన రైతులు ఉపాధి పథకం ద్వారా అందజేస్తున్న ఉద్యాన పంటల మొక్కలను సకాలంలో నాటుకోవాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి పథకం ఫీల్ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఎంపిక చేసిన గిరిజన ఉద్యాన పంటల మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మొక్కలు నాటుకున్న రైతులకు మూడేళ్ల పాటు సాగు ప్రోత్సాహాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలకు పని కల్పించలేదని ఫిర్యాదులు వస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌వో రామ్ ప్రసాద్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాలొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించండి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 8: మండలంలోని ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీల నాయకుల ఫొటోలు, ఫ్లెక్సీలు తొలగించాలన్నారు. రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. వివిధ పార్టీలు సమావేశం ఏర్పాటు చేసుకోవాలంటే ఉమ్మడి జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. కోడ్‌ను ఉల్లంఘిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.